# మతి పోగొట్టిన ఎన్నిక

(కథానిక)

"మా వూళ్లో ఎప్పుడెప్పుడనుకొంటున్న ఎన్నికలు వచ్చాయి, అయిపోయినాయి కూడాను. ఆశ గొలిపే హామీలతో సామాన్య ప్రజానీకాన్ని నమ్మించి అఖండమైన మెజారిటీతో గెలిచాడు కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థి. పాతాళలోకంనుండి వనవిహారం చేయటానికి భూతలానికి వచ్చిన నాగకుమారుడిలాగా, అతన్ని చూచి అందరూ మురిసి మోహించారు. ఆ పోలింగు బూతుల కటిక చీకట్లో పెట్టిన పెట్టెల కఠిన పరీక్షల కోర్చుకొని ప్రతి ఆశాజీవి వోటు వేశాడు.

మిట్టమధ్యాహ్న కాలం. సహారా ఎడారిని గట్టిగా పిండిపారేసిన పిప్పిమాదిరి ఉన్నది ఆ ఊరు. "మూడు" సంఖ్య అంత మంచిది గాకపోయినా ముగ్గురం బయలుదేరాము. ఆ సాయంత్రమే కాంగ్రెసు ప్రచారానికై మీటింగొకటి ఏర్పాటు చేయదల్చుకున్నాము. గొంతెండి పోతున్నది. అల్లంతదూరాన ఓ పెద్దమనిషి చురుగ్గా వస్తున్నాడు. మా ముఖాల వైఖరి అప్పుడే గమనించాడు. దగ్గరకు రానిచ్చి తన కొయ్య మీసాలు మెలిపెడుతూ "ఏం ఇంకా దోసక తిందామని వచ్చారే," అని గర్జించాడు. "ఇక చాలుచాలు వెళ్లండి. అట్టే ఆపకుండా గుట్టుగా దాటుకోండి" అని హితబోధ చేశాడు చరచర నడుస్తూ. ముగ్గురి మొహాలు ముడుచుకొన్నాయి. మొగాలు మొగాలు చూసుకొని ఈ వూళ్లో మజ్జిగనీళ్లు కాకుండా మంచి నీళ్ళు చుక్కయినా పుట్టదు. మీటింగు సంగతి దేవుడెరుగు. ఒకవేళ కర్మంచాలక పెట్టామో, రాళ్లు, రప్పలువేసి రసాభాసం చేస్తారు. వద్దురా బాబూ అని వెనక్కితిరిగాము. ఎక్కడినుంచో రాయి ఒకటి రయ్‌మని మా వాడి చెవి రాసుకొంటూ పోయింది. రన్నింగ్ రేస్‌లో ఫస్టు ప్రైజ్ నాదేనంటే నాదేనని దౌడు దీశాము.

నా స్నేహితులంతా ఎటుపోయారో నాకు తెలీదు. ఆలసటతో గుండె చేతిలోపట్టుకొని పరుగిడుతూ, పరుగిడుతూ రాయితగిలి బోర్లపడ్డాను. ప్రపంచమంతా గిర్రున పరిభ్రమించింది. కనురెప్పలు బరువై మూసికొన్నాయ్. కండ్లు తెరచేసరికి మాయింట్లో ఉన్నాను. గడచినదంతా ఒక్కటొక్కటిగా జ్ఞప్తికి వస్తున్నాయ్. కాంగ్రెసు పార్టీనే మింగేద్దామన్నంత కోపం వచ్చింది. ఐనా కాంగ్రెసు ఏమిచేసింది. అన్ని పార్టీలు తాము చెయ్యబోయే సుకార్యాలు చెప్పితే, కాంగ్రెసు తాను చేసిన ఘనకార్యాలతో సహా ప్రవర చెప్పుకొన్నది. ఐనా చేసినవే ప్రజలకంటికి కనపడకుండా ఉంటే చెయ్యబోయేవి యెలా కనపడతాయ్. ఇదీ ఒక పాయింటే అనుకున్నాను. అన్నట్టు ఈ ఎలెక్షన్లవల్ల పల్లె పల్లెల్లో రాజకీయ చైతన్యం కలిగిందని ఒప్పుకోక తప్పదు చెప్పక తప్పదు. నిజానికి నామటుకు ఆరోగ్య శాఖామంత్రి యెవరైందీ, ఆర్థిక శాఖామంత్రి యెవరైందీ ఇత్యాదులు క్షుణ్ణంగా తెలిశాయ్. ప్రధానమంత్రినుండి పాగా జవానుదాకా ఎలక్షన కథలు, కబుర్లు. చివరకు మా చిన్నవాడుకూడ ఒకడబ్బావాయిస్తూ "నాన్నా మీవోటు నాకే" అని అన్నాడు. అయినా, మావాడి తెలివి చూద్దామని "ఐతే ఒరేయ్, గెలిస్తే మా కందరికీ ఏమిస్తావురా" అని అడిగాను. డబ్బా బోర్లిస్తూ "ఉళ్లక్కిచ్చి" అని పెద్దగా నవ్వి పరుగెత్తి పోయినాడు. "ఓరి పిడుగా, నీకెన్ని ఊహలురా" అని విస్తుపోయాను. అపుడనిపించింది ఇటువంటి నిరక్షరకుక్షులు ఎసెంబ్లీలకు నిలబడడం ఈ నిరక్షరకుక్షులు వోటివ్వడం అన్నీ బాగానే సమకూరాయని.

తల్చుకుంటే సిగ్గవుతున్నది. ఎలెక్షను

రోజు ఏజెంటుగా బయలుదేరాను (కాంగ్రెస్ తరఫునే సుమండీ). ఏదో అవినాభావ సంబంధంలాగా పవిత్రమైన నా ఖార్కోలు రంగు, కుండవంటి బొజ్జ... ఇంకా... ఇంకా నా ఖద్దరులుంగీ, ఖద్దరుపంచా... ఇవన్నీ సమష్టి రూపం దాల్చి కాంగ్రెసు బుర్రఖారాయుడి లాగా తయారుచేశాయి. నమ్మండి, నమ్మకపోండి. ఒకాయన పట్టపగలే పబ్లికు రోడ్డులో వేలు పెట్టి చూపించి మరీ నవ్వాడు. ఇంతవరకూ నాకు పార్టీ అంటూ ఏదీ లేదు. ఏదో పండిట్ జీ మీది మూఢవిశ్వాసం కొద్దీ నా చేతనైనంత వరకు నేను కూడా శ్రమపడదామని వచ్చాను. ఒక యేబ్రాసివెధవ తన స్నేహితుల్తో 'అడుగో కాంగ్రెసుపార్టీ మూలవిరాట్టు' అన్నాడు. తేళ్లు, జెర్రులు ఒళ్ళంతా పాకినట్లయింది. నన్ను కొడదన్నట్లుగా వెనక్కు తిరిగి చూడకుండా మెల్లగా వెళ్ళిపోయాను. నాకే కవిత్వమొస్తే నాలుగు మత్తేభాలు, శార్దూలాలు రాసి, కసి, నా పసరు చూపించేవాణ్ణి... సరే అయిందేదో అయిపోయింది. తన పూర్వజన్మకృత — కాదు కాదు— పంచవర్షకృత పాపం కొద్దీ మా అభ్యర్థి డిపాజిట్టు కూడా పోగొట్టుకొన్నాడని నా నోట వేరే చెప్పనక్కర లేదు. ఎలెక్షన్ల ఖర్చుకు అప్పిచ్చిన వాళ్ళందరు ఎప్పుడెప్పుడని గుంజటం ప్రారంభించారు. మొగుడు పోయి ముండ ఏడుస్తుంటే రంకు మొగుడొచ్చి రాళ్లేసేడన్న సామెతగా పాపమాయన్ని చూసేసరికల్లా "అయ్యో" అనిపించింది."

ఇదంతా నా స్వప్న జీవితంలో ప్రథమాధ్యాయం మాత్రమే. ఇక నూతనాధ్యాయం మొదలెడుతుంది. ఆహా! ఆనాటి మరవరాని మధురస్వప్నం ఇంకా కళ్ళల్లోనే మెదుల్తూ ఉంది. ఆ స్వప్న ప్రపంచంలో తీయని సంఘటనలు. చివరకు కలలోనైనా నలుగురిలోను చప్పట్లు కొట్టించుకొన్నాను. పూల దండలు వేయించుకొన్నాను. జైలులో పడకపోయినా, 'జై'లు అనిపించుకొన్నాను. పెక్కు మంది ఒక్కుమ్మడిగా వేసిన నమస్కార బాణాలను ధైర్యంగా అడ్డిన కారణంచేత కళ్ళ నొప్పులు కూడా పట్టుకొన్నాయ్. అయితేనేం, రంగు రంగుల పూలదండలతో పల్లకీలాగా మోటారు కారును అలంకరించారు. అసంఖ్యాకమైన ప్రజానీకం కారుచుట్టూ చేరి ఈగలవలె ముసురుకొంటూ జయజయధ్వానాలు చేస్తున్నారు. పూలమాలలు విసరి కొట్టున్నారు "ఒక్కరికీ డిపాజిట్టు రాకుండా గెలిచిన... ఫలానా గారికీ జై!" అనే నినాదాలు మిన్నుకుమిన్నుకు తాళం వేసినట్లుగా చెలరేగుతున్నాయ్. అనిర్వచనీయానందవేశాంతరంగంతో చిన్న కునుకు తీశాను-కలలో కల— ఒక భవనంలో విద్యుద్దీపాల మధ్య పట్టు పరుపు మీద దర్జాగా కూర్చొనుంటే యెన్నో రెకమెండేషన్ ఫారాలు. ఎన్నో అప్లికేషన్లు ఇంకా ఇంకా ఎన్నెన్నో కిందపడి వున్నాయ్. ఎంతో మంది పొద్దుట్నించి చేతులు జోడించుకొని నిలబడి వున్నారు. "ఇప్పుడు కాదు రేపు మార్నింగ్ రండి" అని పంపించేశాను. 50 బస్తాలు మా ఇంటికి రవాణా అయ్యాయి. రవ్వల నెక్లెసుతో డైమండ్ వడ్డాణంతో తులతూగుతూ నా భార్యామణి యెదురుగా వచ్చి అదురు బెదురు లేకుండా ముదురు గులాబీ చీరమీద ముష్టి మెుక్కలు గాలికి చెదురుతూంటే ఎదురుగా కూర్చుంది. ఇరవైయైదువేలు కట్నం ఇస్తామంటూ మా పిల్లవాడికి సంబంధం వస్తే ముష్టి ఇరవైయైదువేలు యాభై వేలిస్తే పిల్లను చూసుకోకుండా చేసుకుంటామని ఖరారు మాట చెప్పేశాను. తళతళ మెరుస్తూ రూపాయినాణాల వర్షం ముందర పడింది. రెండుమూడు గంటలు తనివిదీర లెక్కించాను. "సరే రేపే ముహూర్తం పెట్టిండి" అంటూ గేటు దాకా సాగనంపుదామని పోయాను. అడుగడుగులో అడుగు వేసుకుంటూ ఆలోచిస్తూ వస్తున్నాను. ఎక్కడినుండో నా భార్య కెవ్వుమని కేక వేసింది. నా రూపాయలు సంచిలో పోసుకొంటున్న గలగల శబ్దం వినిపించింది. అబ్బా ప్రక్కలో కత్తిపోటు. విద్యుద్దీపాలన్నీ ఆరిపోయాయి. నా భవనం మాయమైంది. "దొంగ! దొంగ!" అని కేకవేసి లేచి కూర్చున్నాను. "ఎక్కడ? ఎక్కడ? ఏమిటండీ" అని కంగారుతో లేచి ప్రశ్నించింది మా ఆవిడ. కండ్లు బాగా నలుముకొని ఎగాదిగా మా ఆవిడకేసి చూశాను. రవ్వల నెక్లెసు లేదు. డైమండ్ వడ్డాణం లేదు. ఒక చిరునవ్వు నవ్వుతూ "మతి పోయిందా ఏమిటి?" అంది.